Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143




Editor : Dama Vijaya Kumar | Volume : 2 | issue: 47 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 2 | సంచిక :47 | మంగళవారం 17 ఫిబ్రవరి 2026 | వెల : 3 | పేజీలు : 4



### అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై

# తీర్పు రిజర్వ్

- సంక్రాంతి సంబరాల పేరుతో లక్కీ డ్రా నిర్వహించిన కేసు
- అంబటికి బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరిన న్యాయవాది పొన్నవోలు
- పూర్తి స్థాయి విచారణ కోసం కస్టడీ అవసరమన్న పోలీసుల తరపు న్యాయవాది

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది. ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరపున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ - మిగతా 3లో

# ఏపీలో టెక్నాలజీ పాలన భేష్

- ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్ గేట్స్ వెల్లడి
- డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్‌కు వివరించిన సీఎం చంద్రబాబు
- డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్
- రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నాం




**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సందర్శించిన బిల్ గేట్స్ అక్కడ డిస్ ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభు త్వ విభాగాలనూ అనుసంధానించామని తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచేశారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందించటం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని...ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని సీఎం వివరించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన బిల్ గేట్స్ - మిగతా 3లో

### డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది

# కీలక పాత్ర

- బిల్ గేట్స్ కితాబు
- బిల్‌గేట్స్‌తో మంత్రుల ప్రత్యేక సమావేశం
- గేట్స్ ఫౌండేషన్ తో ఏపీకి కొత్త దశ-దిశ
- ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యం
- బిల్ గేట్స్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ అమరావతి రాక చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధికారతకు ఇది దోహదపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి... ముందుగా గేట్స్, ఆయన బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి తాను బిల్ గేట్స్‌ను కలిశానని... హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానని... మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు - మిగతా 3లో



## ప్రపంచం భారత్‌కు వస్తోంది

- ఇండియా ఏఐ సమ్మిట్‌పై ప్రధాని మోదీ
- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికిన ప్రధాని మోదీ
- ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రారంభించనున్న ప్రధాని
- 'పలు రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు'

### భారత డిజిటల్ విప్లవంలో

# మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులు

- చంద్రబాబుతో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారు...
- జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు
- చంద్రబాబు, జగన్ తీరును పోలుస్తూ రెండు ఫొటోలతో పార్థసారథి సోషల్ మీడియాలో పోస్ట్
- అమరావతిలో చంద్రబాబుతో భేటీ అయిన మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్
- డిజిటల్ పాలనలో చంద్రబాబు కృషి అమోఘమని బిల్ గేట్స్ ప్రశంస

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**



మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు గారితో ఉంటే బిల్ గేట్స్‌ను కలుస్తారుడ జగన్‌ను నమ్ముకుంటే గేటు బయటే ఉంటారు" అంటూ సోషల్ మీడియా వేదికగా ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన రెండు ఫొటోలను పోలుస్తూ ఒక పోస్ట్ పెట్టారు. ఒక ఫొటోలో వైసీపీ అధినేత జగన్ తన ఇంటి నుంచి బయటకు వస్తుండగా, పలువురు వైసీపీ నేతలు గేటు బయట వేచి ఉన్న దృశ్యాన్ని మంత్రి పంచుకున్నారు. మరో ఫొటోలో - మిగతా 3లో

## దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు



- రాష్ట్రాలను కలుపుతూ భారీ నెట్‌వర్క్
- మాదక ద్రవ్యాల రవాణాకు చెక్
- దేశమంతా సీసీ కెమెరాల అనుసంధానం
- ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- సరిహద్దుల్లో అధునాతన టెక్నాలజీ
- దిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి కీలక వ్యాఖ్యలు

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు

- 9మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు
- మహిళలకు ఆలయ ప్రవేశం అంశంపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం
- తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు



## పార్లమెంట్ సజావుగా సాగడం రాహుల్‌కు ఇష్టం లేదు

- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- పార్లమెంట్ సజావుగా సాగడం రాహుల్‌కు ఇష్టం లేదని ఆరోపణలు
- పార్లమెంట్‌లో చిన్న పార్టీలు మాట్లాడే సమయాన్ని కోల్పోతున్నందున సభను నిలిపివేయవద్దు



## భక్తురాలి మృతిపై అసత్య ప్రచారాలను నమ్మకండి

### ఆలయ ఈవో బాపిరెడ్డి



**శ్రీకాళహస్తి, చిత్తూరుఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 16:** శ్రీకాళహస్తి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో ఒక మహిళా భక్తురాలు మరణించిన ఘటనపై సోషల్ మీడియా, కొన్ని పత్రికల్లో వసున్న వార్తలను ఆలయ అధికారులు ఖండించారు. ఈ మేరకు కార్యనిర్వహణాధికారి టి. బాపిరెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ వాస్తవాలను వెల్లడించారు. ఆదివారం మధ్యా హ్నం 1గంట సమయంలో ఆలయం వెలుపల ఉన్న రాజగోపురం వద్ద ఒక గుర్తు తెలియని మహిళ అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోయారని. భక్తుల సమాచారం మేరకు వెంటనే ఆలయ సిబ్బంది మెడికల్ క్యాంప్ ద్వారా ఆమెకు ప్రథమ చికిత్స అందించారన్నారు. అనం తరం 108 అంబులెన్సులో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు. విచారణలో ఆమె చిట్టమూరు మండలానికి చెందిన కన్నెబోయిన రాజేంద్ర బార్య మణెమ్మ అని తెలిసిందన్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉండటం వల్లే ఆమె మరణించారనే వార్తల్లో వాస్తవం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఆమె ఆలయం వెలుపల అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. శివరాత్రి రోజున భక్తుల కోసం మెరుగైన ఏర్పాట్లు చేశామని, మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సామాన్య భక్తుల కు ప్రాధాన్యతనిస్తూ దాదాపు 30 నిమిషాల లోపే దర్శనం కల్పించామని పేర్కొన్నారు. దేవ స్థానంపై జరుగుతున్న ఇటువంటి అసత్య ప్రచారాలను భక్తులు నమ్మవద్దని ఈ సందర్భంగా అధికారులు కోరారు.

## అలా పాలసముద్రం మండలంలో

## ఎలక్ట్రికల్ సైకిల్ పై సరదాగా తాళ్లూరు శివ



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి16:** పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం, కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించుకుందాం అని పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి శివ అన్నారు సోమవారం పాలస ముద్రం మండల కేంద్రంలో ఎలక్ట్రికల్ సైకిల్‌లో అలా పాలసముద్రం మండలంలో సరదాగా సైకిల్ తొక్కుతూ ప్రజల సమస్యను తెలుసుకుంటూ ప్రజలతో సరదాగా మమేకమయ్యారు. అలాగే ఈ ఎలక్ట్రికల్ సైకిల్ నడపడం ద్వారా కాలుష్యం ఉండదు మనము ఆరోగ్యంగా ఉండొచ్చు అని ప్రజలకు తెలియజేశారు. ఇలా ఉన్నట్టుండి పాలసముద్రం మండలంలో పాల సముద్రంమండల అధ్యక్షుడు తాళ్లూరి శివ సైకిల్ తొక్కడంతో గ్రామాల్లో యువతకి ఉత్సాహం ఉత్తేజం కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు శేఖర్ రాజు పెను మూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుల్ నాదన్ పాలస ముద్రం మాజీ ఎంపీపీ ఇంది రమ్మ, మండల ప్రధాన కార్యదర్శి సాంబశివ, నవీన్ చౌదరి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా

## కంగుంది గ్రామంలో కబడ్డీ టోర్నమెంట్ ఘన విజయం



**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకుని కంగుంది గ్రామంలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్ ఘనవిజయంగా ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతా వరణంలో సాగి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఏపీ ఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ ముని రత్నం, గ్రామ పెద్దలు హాజరై క్రీడాకారులను అభినందిస్తూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని ప్రోత్సహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన జట్లు పాల్గొనగా ప్రతి మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరై క్రీడాకారులలో ఉత్సాహం నింపారు. పోటీల ఫలితాలలో భాగంగా మొదటి బహుమతిగా రూ. 30,000 నగదు బహుమతిని కాళికాంబ బాయ్స్-- కోలార్ జట్టు కైవసం చేసుకుంది. రెండో బహుమతి రూ.22,000ను 7 స్టార్ కెవి జట్టు, మూడో బహుమతి రూ. 15,000ను వానియంబాడి జట్టు, నాలుగో బహుమతి రూ.10, 000ను మిన్నూరు జట్టు, ఐదో బహుమతి రూ.6,000ను వేలూరు బాయ్స్-- వేలూరు జట్టు గెలు చుకున్నాయి. ఫైనల్ మ్యాచ్ అత్యంత ఉత్కంఠభరితంగా సాగగా విజేత జట్టుకు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందజేశారు. రన్నరప్ జట్టుకు కూడా ప్రత్యేక బహుమతులు ప్రదానం చేశారు. ఇక మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని దేవాలయాల్లో సంప్రదాయ పద్ధతిలో అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు రోజులుగా జరిగిన శివరాత్రి వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సోమవారం ఒక్కరోజే దాదాపు 20 వేల మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అన్న దాన కార్యక్రమంలో సుమారు 20 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరిం చారు. గ్రామస్థుల సమిష్టి సహకారంతో శివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.

## వేలు వర్ధంతి సందర్భంగా అన్నదానం



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి16:** చిరు వ్యాపారుల సంఘం సభ్యుడు వేలు ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారు ల సంఘం అధ్యక్షుడు మంజునాథ్, కార్య దర్శి మతీన్, సభ్యులు సురేష్, సంతోష్, లోకేష్, ప్రవీణ్, గురుస్వామి, పెరుమాళ్ స్వామి, చంద్ర, ఖలీమ్ పాల్గొన్నారు.

# వైభవంగా లేపాక్షి మహాశివ రాత్రి ఉత్సవాలు.

## అంగరంగ వైభవంగా లేపాక్షి శివపార్వతుల బ్రహ్మరథోత్సవం





**హిందూపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి 16:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయంలో ఉన్న ప్రసిద్ధ నాగపడగ శివలింగం వద్ద ఆదివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించగా, కలెక్టర్ భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రార్థనలు సమర్పించారు. అనంతరం జిల్లాకలెక్టర్ ఆలయ ప్రాంగణంలో భక్తులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి, మహాశివరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిపూర్వకంగా జరుగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన మహాశివరాత్రి జాగరణ కార్యక్రమాలు అత్యంత అద్భుతంగా జరిగాయి. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యద ర్శులు డా.సురేంద్ర, బాలాజీ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. లేపాక్షిలో వెలసిన శ్రీదుర్గాపాపనేశ్వరస్వామి శివపార్వతుల కళ్యాణం, బ్రహ్మ రథోత్సవమును బ్రహ్మాండంగా కనివిని ఎరుగని రీతిలో వేడుకలు జరిగాయి. ఆలయ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కూడా బ్రహ్మ రథోత్సవం లక్షలాదిమంది భక్తుల నడుమ ఈ కార్యక్రమం కొనసాగుతూ వస్తోంది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దేవాలయం ప్రతిరోజు వేలాదిమంది యాత్రికులు సందర్శిస్తూ లేపాక్షి కీర్తి ప్రతిష్టలు దశ దిశల వ్యాపింప చేస్తున్నారు. సోమవారం బ్రహ్మరథోత్సవం కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది కొనసాగడం చాలా సంతోషంగా భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు జిల్లా ఎస్పీసతీష్ కుమార్ రెండు రోజుల ముందుగా పర్యటించి డీఎస్పీ మహేష్, రూరల్ సీఐ కె.జనార్ధన్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, బాలాజీ, ఈఓ నరసిం హమూర్తి, ఆలయ చైర్మెన్ రామానందన్, తహ సీల్దార్ జి.సౌజ న్యలక్ష్మి, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ఈఓ నరసిం హమూర్తి, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు మండల ప్రజలుతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు, కర్ణాటక, తమిళనాడు భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలు కోటమ్మకు

## ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ భరోసా



**ఎస్ ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:** విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో పూరి ఇల్లు దగ్నం అయిన బాధితురాలు కోటమ్మకు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ భరోసా కల్పించారు. ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు, పంచాయతీ గొల్ల ఇండ్లకు చెందిన కోటమ్మ విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోవడంతో తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ తెలిపారు. ఇది పేదల ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు అండగా ఉంటారని అన్నారు. ఆమెకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని త్వరలోనే ఆమెకు 50 వేల రూపాయలు ప్రభుత్వం నుండి సహాయం చేస్తామని తెలిపారు.

## స్టేట్ టూ బూత్ ప్రతి సమాచారం

## లీడర్ టు కేడర్ క్షణాల్లో మీకు అందించేది

## మై టిడిపి యాప్. తాళ్లూరి శివ



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 16:** పాలసముద్రం మండలంలో పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తాళ్లూరు శివ మై టిడిపి యాప్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరి శివ మాట్లాడుతూ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో మై టిడిపి యాప్ పోస్టర్లు ఆవిష్కరించి మై టిడిపి యాప్ వల్ల ఉపయోగాలను తెలియజేశారు. అలాగే ఈమై టిడిపి యాప్ స్టేట్ టూ బూత్ ప్రతి సమాచారం లీడర్ టు కేడర్ క్షణాల్లో మీకు మై టిడిపి అఫ్ అందిస్తుందని తెలియజేశారు. అలాగే ప్రతి క్లస్టర్ ఇంచార్జి బూత్ ఇంచార్జి మై టిడిపి యాప్ గ్రామాల్లో టిడిపి నాయకులకు కార్యకర్తలకు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అరుల్ నాదన్, పాలసముద్రం మండల మాజీ ఎంపీపీ టిడిపి సీనియర్ నాయకురాలు ఇందిరమ్మ, మండల ప్రధాన కార్యదర్శి సాంబశివ, నవీన్ చౌదరి, సెల్వం, పురుషోత్తం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుడికి 50 బస్తాల సిమెంటు వితరణ



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:** వీకోటమండలం కృష్ణాపురం గ్రామ పంచాయతీ కృష్ణాపురం గ్రామంలో వెలసియుండు శ్రీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలకు దానమయ్యగారిపల్లి గ్రామానికి చెందిన చీటీల వ్యాపారి చంద్రబాబు,స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అభిషేకం అనంతరం స్వామి వారి పైన ఉన్న నమ్మకంతో పి.చంద్రబాబు మాట్లాడుతూ ఆలయానికి 50బస్తాల సిమెంటును తాను కానుకగా సమర్పిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తకు మాట ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు కుటుంబంతో పాటు కృష్ణాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ప్రజా సంక్షేమానికి దిక్సూచి

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:** రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ కుప్పం టిడిపి కార్యాలయంలో సోమవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ లకు టిడిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా బడ్జెట్ రూపొందించబడిందన్నారు ముఖ్యంగా విద్యా రంగం బలోపేతం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, రైతులు, పేద ప్రజల సంక్షేమానికి కేటాయించిన నిధులు ప్రభుత్వం ప్రజాప్రయోజనాలకు కట్టుబడి ఉందని సూచిస్తున్నాయని తెలిపారు. టీటీడీ పాలక మండలి సభ్యులు శాంతారామ్ మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను సమతుల్యం చేస్తూనే సంక్షేమ పథకాలను కొనసాగించేలా బడ్జెట్ రూపొందించారని పేర్కొన్నారు. కుప్పం మాజీ ఎంపీపీ సాంబశివం మాట్లాడుతూ ఈ బడ్జెట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చనిపోయిన టిడిపి కార్యకర్త కుటుంబానికి అండగా

## నిలిచిన ఎంపీ దగ్గుమళ్ళ,ఎమ్మెల్యే మురళీమోహన్

### 4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిన ప్రజాప్రతినిధులు, తెలుగు తమ్ముళ్లు

### కృతజ్ఞతలు తెలియజేసిన బాధిత కుటుంబం



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:** రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త దినకర్ కుటుంబానికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత జయప్రకాశ్ అండగా నిలిచారు. నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి, బాధిత కుటుంబంలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. గత ఏడాదిలో.. పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళెం మండలం, నలగాంపల్లి గ్రామ పంచాయతీ, నలగాంపల్లి గ్రామానికి చెందిన దినకర్ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, టిడిపి సీనియర్ నేత జయప్రకాశ్, బంగారు పాళెం టిడిపి మండలాధ్యక్షులు ధరణి ప్రసాద్, దినకరన్ కుటుంబానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎంపీ, ఎమ్మెల్యే, తెలుగు తమ్ముళ్లు.. దినకర్ భార్య బిందు, పిల్లలు , కుటుంబ సభ్యులకు నాలుగు లక్షల రూపాయలు నగదును అందించి బాసటగా నిలిచారు. కష్టాలలో ఉన్న బాధితు కుటుంబానికి తోడ్పాటు అందించడంతో.. దినకర్ కుటుంబం సభ్యులు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, టిడిపి సీనియర్ నేత జయప్రకాశ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

చిత్తూరు ఎక్స్‌ప్రెస్
జాతీయ తెలుగు దినపత్రిక
APTEL/2024/86143



# సైలెంట్ మోడ్‌లోకి కొట్టు సత్యనారాయణ

**ఏలూరు :** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చే జరగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట.ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత




జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్ట్స్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్ళాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో..ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే.. తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమంటూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు. కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తారో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టీవ్ అవుతారా? లేక తనదారి తన చూసుకుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలమాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# ఎన్నికలకు రెడీ అవుతున్న ఈసీ

**విజయవాడ :** స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటినుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పోరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి




చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

# పోటీ చేయాలంటున్న కేడర్...

**నెల్లూరు :** తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్



మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉంది.ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా

## ఏపీలో టెక్నాలజీ పాలన భేష్

-మొదటిపేజీ తరువాయి

పౌరసేవలను సులభతరం చేయటం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... దట్స్ వెరీ నైస్ అంటూ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందని అన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ గ్రేట్ వర్క్ అంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్ గేట్స్‌కు వీడియో డిస్ ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికా గార్గ్, ప్రఖర్ జైన్, సౌరబ్ గౌర్, సురేశ్ కుమార్‌లు ప్రజంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్సు, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో జరిగిన ప్రజంటేషన్ల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సీఎస్ కె.విజయానంద్ సహా తదితర అధికారులు పాల్గొన్నారు.

## డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలక పాత్ర

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలబడిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్నినెంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్...డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని ఆనాడే గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్ గేట్స్, వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం...టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగంచడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు. స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్ధాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతీ వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం'గా సీఎం చెప్పారు.

**సీనియర్ ఐఏఎస్ అధికారి బాబు ఏ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా... ఏఐ**
రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వారం ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా ఏఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఏఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.ఖ

## భారత డిజిటల్ విప్లవంలో మోదీ, చంద్రబాబు కీలకపాత్రధారులు

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌తో పాటు తాను, ఇతర మంత్రులు కలిసి ఉన్న చిత్రాన్ని జతచేశారు. ఈ రెండు చిత్రాలను పోలుస్తూ ఆయన పైవిధంగా వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు మంత్రి పార్థసారథి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ, భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించడంలో చంద్రబాబు చేస్తున్న కృషిని బిల్ గేట్స్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కీలక సమావేశం జరిగిన నేపథ్యంలోనే మంత్రి పార్థసారథి చేసిన పోస్ట్ రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

-మొదటిపేజీ తరువాయి



మంజూరు చేయాలని కోర్టును కోరారు. పోలీసుల తరఫున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# ఘనంగా హెల్త్ బిల్డింగ్ భూమి పూజ కార్యక్రమం



**పెనుమూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:**
పెనుమూరు మండలం సి ఆర్ కండ్రిగ గ్రామంలో హెల్త్ బిల్డింగ్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పెనుమూరు మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పి.రుద్రయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తలారి రెడ్డప్ప, గుర్రప్ప నాయుడు, దుర్గాప్రసాద్, శంకరయ్య, భూషణ్ రెడ్డి, రామూర్తి రెడ్డి, హేమ చలపతి తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి దిశగా హెల్త్ బిల్డింగ్ నిర్మాణం ఒక ముఖ్యమైన అడుగుగా స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ భవనాన్ని తన ఆధ్వర్యంలో నిర్మిస్తున్న జ్ఞానేంద్ర మాట్లాడుతూ, ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే విప్ థామస్‌కు అలాగే మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారం వల్లే గ్రామానికి ఈ సేవా కార్యక్రమం సాధ్యమైందని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, హెల్త్ బిల్డింగ్ పూర్తయిన తరువాత గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే జ్ఞానేంద్ర సి ఆర్ కండ్రిగ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. గ్రామ అభివృద్ధి దిశగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది.

# ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు






**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:**
అన్నమయ్యజిల్లా పీలేరుపట్టణంలో ప్రభుత్వ భూములపై ఆక్రమణలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో రాత్రికిరాత్రే అక్రమంగా రేకులతో గది నిర్మించడం, పై స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ భూమిపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ం

## వైభవంగా ఓదేటి యల్లమ్మ ఊరేగింపు ఉత్సవాలు



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:**
అన్నమయ్య జిల్లా పీలేరు మండలం ముడుపుల వేముల గ్రామం రెడ్డివారి పల్లిలో శ్రీ ఓదేటి యల్లమ్మ ఊరేగింపు ట్రస్ట్ చైర్మన్ పల్లవోలు హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు, చాందిని బండ్లు, హరికథ, తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి సందర్భంగా కొండమల్లేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 16:**
వెదురుకుప్పం మండలం మాంబేడు పంచాయతీలోని కొండమల్లేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు దేశం నాయకులు గురుసాల కిషన్ చంద్‌లు ఈ పూజలకు స్థానాన్ని అందించారు.యూనిట్ ఇంచార్జ్ మోహన్ యాదవ్, పారిశ్రామికవేత్త సుబ్రహ్మణ్యం రెడ్డి, సర్పంచ్ కటారి మమత మోహన్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు సువ్వాల ముని రాజారెడ్డి, మహిళా నాయకురాలు సువ్వాల జ్యోతి రెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్‌రెడ్డి, బూత్ కన్వీనర్ మురళీ మోహన్‌రెడ్డి, బూత్ కన్వీనర్ బోడిరెడ్డి మోహన్ రెడ్డి, గ్రామ కమిటీ కార్యదర్శి యుగంధర్ మరియు ఆలయ నిర్వహకులు సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. గ్రామస్థులు భక్తిభావంతో పూజల్లో పాల్గొని స్వామి వరాలు కోరారు.

## సీనియర్ టీడీపీ నేత సుబ్బన్న శెట్టి మృతికి ఎమ్మెల్యే సంతాపం



**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:**
వి.కోట మండల మాజీ వైస్ ఎంపీపీ వి. ఎస్. గోపినాథ్ తండ్రి, టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బన్న శెట్టి మృతికి పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి సోమవారం తన సంత పాన్ని తెలియజేశారు. వి.కోట మండలం కొంగాటం పంచాయతీకి చెందిన సుబ్బన్న శెట్టి వృద్ధాప్య సమస్యతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండల టిడిపి నేతలతో కలిసి వారి స్వగ్రామానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గోపీనాథ్ కుటంబీకులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్త పరిచారు. ఈ సంతాప కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, వీ.కోట మండల నాయకులు రాంబాబు, రంగనాథ్, చౌడప్ప, అక్మల్, హరి, కుమార్, చంద్రారెడ్డి, కేశవరెడ్డి, సతీష్, జనార్ధన్, చందు సతీష్, బీజేపీ నాయకులు విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## 2026-27 వార్షిక బడ్జెట్ ఏపీ సీఎం

# చంద్రబాబు దూర దృష్టికి నిదర్శనంగా నిలుస్తోంది

**అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించనుంది**
**ఏపి ఆర్థిక వ్యవస్థకు మూలస్థంబంలా నిలవనుంది**
**సామాన్య ప్రజల ఆశలను నెరవేర్చే బడ్జెట్**
**చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు షణ్ముగం రెడ్డి ,కార్యదర్శి సునీల్ చౌదరి**




**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, ఫిబ్రవరి16:**
రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేసు ప్రవేశపెట్టిన 2026-27వార్షిక బడ్జెట్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనంగా నిలిచిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పష్టం చేశారు. నవ్యాంధ్ర సాధనకు వూతమివ్వడంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా పరుగులు పెట్టించనుందని చెప్పారు. మొన్న ఏపీ అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన 2026-27కు సంబంధించిన వార్షిక బడ్జెట్‌నుపై సోమవారం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు,టిడిపి పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి,చూడ ఛైర్పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే మనోహర్, మాజీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, టిడిపి సీనియర్ నేత మోహన్ తదితరులు హర్షంవ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు విజన్ను కొనియాడారు. రూ.3,32,205 కోట్లతో బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సామాన్యుల అవసరాలను తీర్చేందుకు దోహదం చేస్తుందని తెలిపారు. ఏపీ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా నిలవడంతోపాటు వ్యవసాయ రంగానికి వూతమివ్వనుందని చెప్పారు. బడ్జెట్ స్వరూపాన్ని పరిశీలి స్తే.2026-27 వార్షిక బడ్జెట్ రూ.3,32, 205 కోట్లు కాగా ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,56, 143 కోట్లు అని పేర్కొ న్నారు. మూలధన వ్యయం రూ.53,915 కోట్లు,రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లు,కాగా.. **ద్రవ్యలో టు:** రూ.75,868 కోట్లు అన్నారు. ఇక బడ్జెట్ కేటాయింపు వివరాలను పరిశీలి స్తే రాజధాని అమరా వతి నిర్మాణానికి రూ.6,000 కోట్లు,విద్యుత్ రంగానికి రూ. 13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్ పోర్టులకు రూ.13, 546 కోట్లు, వీబీ జీ రామ్‌జీ'కి రూ.8,365 కోట్లు,గృహ నిర్మా ణరంగానికి రూ.5,451 కోట్లు,పరిశ్రమలకు రూ.3,161కోట్లు,సర్దు బాటునిధి రూ.1,500 కోట్లు,స్వచ్ఛ భారత్ మిషన్ కు రూ.1,037 కోట్లు,ఎన్టీఆర్ వైద్య సేవ కు రూ.4,000 కోట్లు, జల్ జీవన్‌కు రూ.4,000 కోట్లు కేటాయింపులు జరపడం, కూటమి ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శంగా నిలిచిందన్నారు. 2026 - 27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం -నీటి భద్రత కేటాయింపుల విషయానికొస్తే, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ -- రూ.6,600 కోట్లు,పోలవరం -- రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన -- రూ. 1,927 కోట్లు,ధరల స్థిరీకరణ నిధి -- రూ. 500 కోట్లు,మత్స్యకార సేవలో -- రూ. 260 కోట్లు, పంటల బీమా -- రూ.250 కోట్లు, పి.యంకృషి యోజన -- రూ.190 కోట్లు రూపాయల కేటాయింపులు ఏపీ సీఎం చంద్రబాబు సమర్థతకు అద్దం పట్టేలా ఉన్నాయని కొనియాడారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు కేటాయింపులను పరిశీలిస్తే.. ఎన్టీఆర్ భరోసా -రూ.27,719 కోట్లు, దీపం 2.0 - రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతు - రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి - రూ. 1,420 కోట్లు,వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ - రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో - రూ.450 కోట్లు, తల్లికి వందనం -- రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం -- రూ.4,581 కోట్లు,ఉపకార వేతనాలు -- రూ.3,836 కోట్లు,సమగ్ర శిక్ష -- రూ.2,946 కోట్లు, ఉన్నత విద్య -- రూ.2,566 కోట్లు, డొక్కా సీతమ్మ మధ్యా హ్న భోజన పథకం -- రూ.2,161 కోట్లు, మన బడి మన భవిష్యత్ -- రూ.1, 500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి -- రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా -- రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర -- రూ.654 కోట్లు, యువత, క్రీడలు -- రూ.438 కోట్లు కెటాయింపులు..విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దిక్సూచిగా నిలిచిందన్నారు. శాఖల వారిగా బడ్జెట్ కేటాయింపుల విషయానికొస్తే.. వ్యవసా య అనుబంధ రంగాలు - రూ.13,598 కోట్లు,పంచాయతీరాజ్ శాఖ - రూ.22,942 కోట్లు,మున్సిపల్ శాఖ రూ.14,539 కోట్లు,జల వనరుల శాఖ - రూ.18, 224 కోట్లు,పాఠశాల విద్యాశాఖ - రూ.32,308 కోట్లు, ఇంధన శాఖ-రూ.13,934 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ - రూ.11,118 కోట్లు,కార్మిక శాఖ - రూ.735 కోట్లు, గృహ నిర్మాణ శాఖ - రూ.6357 కోట్లు, రోడ్లు, భవన నిర్మాణాల శాఖ - రూ.9,856 కోట్లు, హోం శాఖ - రూ.9,165 కోట్ల కేటా యింపులు ప్రభుత్వశాఖలను బలోపేతం చేయడంలో కూటమి ప్రభుత్వం చూపు తున్న చొరవను తెలియజేస్తోందని తెలియజేశారు.

# భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:**
శ్రీకాళహస్తిపట్టణంలో మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా సోమవారం ఘనంగా నిర్వహించిన రథోత్సవంలో భాగంగా, భారతీయ జీవన పరివర్తనం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చంద్రప్ప భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చంద్రప్ప మాట్లాడుతూ... సమాజ సేవే లక్ష్యంగా భారతీయ జీవన పరివర్తనం చారిటబుల్ ట్రస్ట్ ను స్థాపిం చినట్లు తెలిపారు. వేల సంవత్సరాలుగా భారతదేశం సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ,ప్రపంచానికి మార్గదర్శకంగా గురు స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. విదేశీపరిపాలన కాలంలో మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు కొంత మేరకు దెబ్బతిన్నాయని,



ప్రజలు ఇతర సంస్కృతుల ప్రభావంలోకి వెళ్లార ని ఆయన పేర్కొన్నారు.అయితే ప్రస్తుతం మళ్లీ భారతీయ సంప్రదాయాలు, ధర్మం, సంస్కృతి పునరుజ్జీవనం పొందుతున్నా యని తెలిపారు. విద్య, వైద్యం, విజ్ఞానం, సంస్కృతి, సాహసం, ఆధ్యాత్మికత వంటి అన్ని రంగాల్లో భారతదేశంమళ్లీ ప్రపంచా నికి గురువుగా ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. సనాతన ధర్మ విలువలను కాపాడుకుంటూ, యువతలో దేశభక్తి,సేవాభావం పెంపొం దించడమే తమ ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కండ్రిగ ఉమా ,ప్రమీలమ్మ, పిల్లారీ బత్తినయ్య, మ్యాగీ క్లారా, తరుణ్, జస్వంత్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్నేహితుల మిత్రబృందం అన్నదాన కార్యక్రమం

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి16:**
శ్రీకాళహస్తి పట్టణంలో 13రోజులు పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రథోత్సవం రోజున సోమవారం ఉదయం సూపర్ స్నేహితుల మిత్రబృందం ఆధ్వర్యంలో భక్తులకు భారీ సంఖ్యలో అన్నప్రసాదాలు పంపిణీ చేయడం జరిగినది. స్థానిక పానగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1982-83 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులందరు సూపర్ స్నేహితుల మిత్ర బృందం అనే గ్రూపుగా ఏర్పడి గత 16 ఏళ్ల నుంచి శ్రీకాళహస్తీశ్వరా స్వామీ- అమ్మ వార్ల రథోత్సవం రోజున భక్తిశ్రద్ధలతో భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని ఛైర్మెన్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. నేడు సుమారుగా 2000 మందికి పైబడే రకరాల అన్న ప్రసాదాలు వితరణ చేశామన్నారు. తమ మిత్రబృందంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు, శుభకార్యక్రమాలు జరిగిన కలిసికట్టుగా ఉంటూ వారికి మేమున్నాం అంటూ భరోసాగా నిలబడుతున్నామన్నారు. ప్రజలకు సేవ, సాయం చేయాలనే ఉద్దేశంతో తామంతా ఒక కమిటీగా ఏర్పడ్డామని తెలిపారు. అనంతరం అందరూ కలసి స్వామీ అమ్మవార్ల దర్శనం చేసుకుని వేదపండితుల ఆశీర్వాదం పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్ స్నేహితుల మిత్రబృందం ప్రెసిడెంట్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి పొట్లులూరు రవిచంద్ర,మమత,వైస్ ప్రెసిడెంట్లు ఎన్ ఎస్ రాఘవన్, అరుణ, ఎస్ మణి,పముజుల అమృతమ్మ, కార్యదర్శులు డీ అరవిందమ్మ,షేక్ అబ్దుల్ జబ్బార్, షేక్ జిలానీ, రెడ్డిపల్లి ప్రసాద్,చిర్రి గోపాల్, ట్రెజరర్ పట్టెం సురేష్, ఉచ్చురు హిందూ, సభ్యులు దామలచెరువు గిరిజే శ్వరి,షేక్ అక్బర్ భాషా,ఎస్ రమణ, దాసు పార్వతీ,ఎన్ వెంకటేశన్, అత్తిరాల భాస్కర్, ఈశ్వరమ్మ, మోటుపాళ్యం శేఖర్, రాజేంద్ర, ఎరవి, నీలవర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్‌కు గూడెం మహిపాల్ రెడ్డి గట్టి షాక్

**హైదరాబాద్ :** పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇచ్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆయన బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేశారు. ముఖ్యంగా ఇస్నాపూర్‌లో తన ఎక్స్ అఫీషియో ఓటుతో బీఆర్ఎస్ చైర్మన్‌ను గెలిపించుకున్న అనంతరం, తనదైన శైలిలో బుల్లెట్ దిగిందా లేదా? అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ తరపున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ అభివృద్ధి పేరుతో 2024 జూలైలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ సమయంలో ఆయనపై ఈడీ దాడులు జరిగాయి. పలు రకాల సమస్యలు రావడంతో ఆయన పార్టీ మారారు. మొదట్లో బీజేపీలో చేరుతారన్న ప్రచారం జరిగినా చివరికి కాంగ్రెస్ లోనే చేరారు. అయితే కాంగ్రెస్‌లో చేరి తాను పెద్ద తప్పటడుగు వేశానని, ఆ పార్టీ వల్ల తనకు లేదా నియోజకవర్గానికి వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని



సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు గుర్తింపునిచ్చింది గులాబీ జెండానేనని ఆయన బహిరంగంగానే ప్రకటించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించడానికి ఆయన ప్రచారం చేశారు.. పని చేశారు కానీ.. ఆ పార్టీలో మళ్లీ అధికారికంగా చేరలేదు. మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడాన్ని మొదటి నుంచి స్థానిక కాంగ్రెస్ సీనియర్ నేతలు కాటా శ్రీనివాస్ గౌడ్ , నీలం మధు ముదిరాజ్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి, అక్కడ సీఎం రేవంత్ రెడ్డి ఫోటో లేదని రగడ చేయడం వంటి ఘటనలు ఆయనపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేశాయి. ఈ వర్గపోరు కారణంగానే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో ఇమడలేక తిరిగి బీఆర్ఎస్ బాట పట్టారు. మహిపాల్ రెడ్డి సోదరుడు ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరడం, స్వయంగా ఎమ్మెల్యేనే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునివ్వడం వంటి పరిణామాలు ఆయన పునరాగమనాన్ని సూచిస్తున్నాయి. అయితే, మున్సిపాలిటీల్లో పార్టీని గెలిపించినప్పటికీ, ఆయనను మళ్లీ అధికారికంగా చేర్చుకునే విషయంలో బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. పార్టీ కేడర్ సెంటిమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది. ప్రస్తుతం పటాన్ చెరు నియోజకవర్గానికి ఆదర్శ్ రెడ్డిని ఇంచార్జ్ గా నియమించారు. ఇటీవలి కాలంలో ఆయనే పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ మహిపాల్ రెడ్డిని చేర్చుకుంటే ఆయన అసంతృప్తికి గురయ్యే అవకాశం ఉంది

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh.
Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143